క్లుప్తంగా

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన కొమ్ము చందు తన సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బాధితుడికి ఫోన్ అప్పగించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి విగ్రహాల ప్రతిష్ఠించాలని నిర్వాహకులకు పోలీసులు కోరారు.

పూజారికి నివాళి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రధాన పూజారిగా పనిచేసిన నాయకంటి రామశర్మ (89) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా.. పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. 50 ఏళ్లుగా గ్రామంలో పూజారిగా పనిచేస్తూనే సంగీత కళాకారుడిగా పలు ప్రదర్శనల్లో ప్రతిభను కనబరిచి గ్రామానికి పేరు తీసుకొచ్చారని ఆయన సేవలను పలువురు కొనియాడారు. మాజీ వైస్ ఎంపీపీ బుచ్చన్న గౌడ్, మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, నర్సింహారెడ్డి, గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, బక్కన్న, వంగల వెంకట్‌రెడ్డి, తలకంటి ప్రభాకర్‌రెడ్డి, మంగలి నారాయణ, పల్ల నరేందర్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఆత్మకూర్: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పిన్నంచర్ల గ్రామానికి చెందిన మనోహర్‌గౌడ్‌ను రాష్ట్రశాఖ నియమించింది. ఈమేరకు బుధవారం రాష్ట్రశాఖ నియామక పత్రాలను అందజేసినట్లు మనోహర్ తెలిపారు. యువతకు జరుగుతున్న అన్యాయంపై అలుపెరగని పోరాటాలను చేయనున్నామని, యువతకు ఉద్యోగ భద్రతకోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్రశాఖ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు అభినందించారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా జయశంకర్



పాన్‌గల్: మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా జయశంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పెద్దమందడి ఎంఈఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మార్సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేష్, యాదవ్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరు గ్రామానికి చెందిన ముంత సువర్ణ విద్యుదాఘాతంతో మృతి చెందారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు విషయాన్ని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5వేల ఆర్థికసాయం పంపించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ సర్పంచ్ వెంకటేష్ బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డీలర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



వనపర్తి టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారత్ బంద్ ప్రశాంతం ముగిసిందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు భోజురాజు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన భారత్ బంద్‌కు జాతీయ మాలల ఐక్యవేదిక, ఉద్యోగుల సంఘం, మాల మహానాడు, వివిధ సంఘాలు మద్దతు తెలిపాయని చెప్పారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, నరేష్, శ్రావణ్‌కుమార్, కురుమూర్తి, చంద్రశేఖర్, శ్రీకాంత్, శ్రీనివాసులు, అంజనేయులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాటిపాములలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



మోట్లంపల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంపీఓ శ్రీరాంరెడ్డి



రేవల్లిలో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

డెంగీ నిర్మూలనకు సమష్టి కృషి

కొత్తకోట రూరల్: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్‌ఎన్ సూర్యకుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో కౌన్సిలర్ భరత్‌భూషణ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మదనాపురం: మండలంలోని నెలివిడి, నర్సింగాపురం, నరసింగాపురం తండాల్లో ప్రజలకు జ్వరాల లక్షణాలు ఉన్నాయని తెలియడంతో బుధవారం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యురాలు భవాని వేర్వేరుగా ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా రెండు మలేరియా, ఒక డెంగీ కేసును గుర్తించినట్లు తెలిపారు. మరికొంత మందికి జ్వరాలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని గ్రామస్తులు తెలిపారు. జ్వరం పీడితుల కుటుంబ సభ్యులు 17 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్, అబ్బేట్ స్ప్రే చేయించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ప్రధాన వీధులు, మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారన్ని తక్షణమే తొలగించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ బాలయ్య, సీనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, డాక్టర్ ముజాఫర్, రతన్‌కుమార్, ఏఎన్‌ఎం వనజ, ఆశాఆర్కర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నర్సింగాపురంలో దోమల మందు పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, డాక్టర్ భవాని

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో బుధవారం సీజనల్ వ్యాధులపై ఎంపీఓ రాజు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వంట పాత్రలపై మూతలు పెట్టి ఉంచాలన్నారు. ప్రతి వారం నీటి ట్యాంకులు శుభ్రపరుచుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లో దోమకాటును నిర్మూలించినప్పుడే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వాటిని గ్రామాల నుంచి పారద్రోలవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో డెంగీ నిర్మూలన, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన అంశంపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడటం, చెత్తచెదారాన్ని తొలగించడం లాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలు వ్యాప్తి చెందకుండా కట్టడి చేయొచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం 7వ వార్డులోని ఉర్దూ మీడియం వద్ద వర్షం నీరు చేరి బురదగా మారడంతో మొరం వేయించారు.

దోమలతో జాగ్రత్త

దోమలు కుట్టకుండా ప్రతిఒక్కరూ జాగత్తలు తీసుకోవాలని డెంగీ, మలేరియా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. బుధవారం మోట్లంపల్లిలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు.

గోపాల్‌పేట: వర్షాకాలంలో దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో రోగాలు ఒకరి నుంచి ఒకరికి ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శివజ్యోతి అన్నారు. బుధవారం ఆమె రేవల్లి మండల కేంద్రంలో ఏఎల్‌ఓ టీం సభ్యులతో కలిసి గ్రామంలో పర్యటించి నిల్వ నీటిని పారబోశారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ టీం సభ్యులు డాక్యానాయక్, మధుబాబు, జ్ఞానేశ్వర్, శాంతిభూషణ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.



కొత్తకోటలో..



నర్సింగాపురంలో..



వీపనగండ్లలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



ఆత్మకూర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాల వద్ద..

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



పాన్‌గల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణ కోసం అక్కడే పనిచేసే ఉపాధ్యాయుడు సి కిరణ్‌కుమార్ కవిత్వం, నవల, పరిశోధన గ్రంథాలు, వ్యాస సంపుటాలు మొదలైన 225 పుస్తకాలను బుధవారం హెచ్‌ఎం నరేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక జ్ఞానం నేటితరం విద్యార్థులకు ఎంతో అవసరమని, తెలుగు సాహిత్యం చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం, సాహిత్యంపై మక్కువ ఏర్పడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో పుస్తక సమీక్ష అనే పరీక్ష ప్రక్రియ కూడా నేర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో తన ఇంటి లైబ్రరీలో ఉన్న పుస్తకాలను స్వచ్ఛందంగా పాఠశాలకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కనులపండువగా పోచమ్మ పల్లకీ సేవ



ఖిల్లాఘనపురం: మండలంలోని హన్‌పాడ్‌లో పోచమ్మతల్లి పల్లకీ సేవ కార్యక్రమాన్ని భక్తులు కనులపండువగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించిన ముదిరాజ్ సంఘం సభ్యులు అనంతరం అమ్మవారి పల్లకీని గ్రామ పురవీధుల్లో బాజాబజంత్రీలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అందరిని సల్లంగా చూడాలని వేడుకున్నారు. గురువారం అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కొత్తకోటలో రాఘవేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: సీతారామాంజనేయ సమేత రాఘవేంద్రస్వామి ఆలయంలో రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం నిర్మాల్యవిసర్జనం, పంచామృతాభిషేకం, అర్చన, అష్టోత్తరం, స్వామివారి పల్లకీసేవ తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జ్యోషి గుండాచారి, రవికుమార్‌దేశాయ్, మస్తీపూర్ రాజు, వెంకట్‌జ్యోషి, రంగనాథచారి, వాసుచారి, వెంకోబ్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గొల్లబాబు, మేస్త్రీ శ్రీనివాసులు, రావుల కర్ణాకర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాన్‌గల్: ఇరు వర్గాలు ఘర్షణ పడి ప్రజల శాంతికి, రైతులకు భగం కలిగించిన ఘటనలో బుధవారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌లు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కేపల్లికి చెందిన లోకయ్య, పారిజాత, బాలచంద్రి, రాజు, రాముడు, శ్రీనివాసులు, పరశురాముడు, కృష్ణయ్య, భాగ్యమ్మ, వెంకటేష్ రోడ్డుపై ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇదే సమయంలో బీట్ డ్యూటీ నిమిత్తం అటుగా వెళ్తున్న కానిస్టేబుళ్లు జయరాజు, అజీమద్దిన్ వారిని వారించారు. అనంతరం ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చాట కూలీల సమస్యలు పరిష్కరిస్తాం

వనపర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో కొన్నేళ్లుగా అరకొర పారితోషికంతో పనిచేస్తున్న చాట కూలీలకు కష్టానికి తగిన ప్రతిఫలం అందించేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన వేరుశనగ, తూకాలు, కొనుగోలు ప్రక్రియను ఆయన పరిశీలించారు. చాట కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మయ్యగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీకృష్ణ ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ.. వేడుకల్లో పాల్గొనేందుకు వస్తానని చెప్పినట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్యయాదవ్, పెంటన్నయాదవ్, రాములుయాదవ్, సాయిలుయాదవ్, బాలకొండయ్యయాదవ్, శంకర్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రాజుయాదవ్ తదితరులు ఉన్నారు.



ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు

కొత్త జీఓ విడుదల చేయాలని వినతి

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 10ని వెంటనే రద్దు చేసి కొత్త జీఓను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను వ్యతిరేకిస్తూ బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం 2024 ఏప్రిల్ నుంచి జులై వరకు సమ్మె చేశామని, జులై 16న ఐసీడీఎస్, 19న మంత్రి సీతక్క, ఐసీడీఎస్ డైరెక్టర్లు అంగన్‌వాడీలకు రెండు రోజుల్లో కొత్త జీఓ ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. నెలరోజులు కావస్తున్నా నేటికీ జీఓ ఊసెత్తడం లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, వనజ, విజయలక్ష్మి, నిర్మల, అలివేల, శోభ, పార్వతి, తస్లీమా, శ్రీదేవి, అన్నపూర్ణ, బాలీశ్వరమ్మ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నిలిచిన 'భగీరథ' నీరు

అమరచింత: మిషన్ భగీరథ ద్వారా జిల్లావ్యాప్తంగా నిత్యం తాగునీటిని అందించే బుగ్గపల్లి తండా వద్ద ఉన్న సంపునకు నీటి సరఫరా నిలిచిపోవడంతో జిల్లాలో రెండు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కొత్తకోట సమీపంలోని బుగ్గపల్లితండా సమీపంలో నిర్మించిన మిషన్ భగీరథ ప్రధాన సంపునకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. రెండు రోజుల కిందట కొల్లాపూర్ సమీపంలోని గౌరిదేవిపల్లి వద్ద ప్రధాన పైప్‌కు గండి ఏర్పడడంతో నీటి సరఫరా నిలిపేశారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం సోర్సు బోర్లు ఉండటంతో ప్రజలు నీటి ఇబ్బందులు కలిగినా.. ఉన్న నీటితో సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లీకేజీలను సరిచేస్తున్నాం

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి బుగ్గపల్లితండాకు నీటిని సరఫరా చేస్తున్న ప్రధాన పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో రెండు రోజుల నుంచి వీటికి మరమ్మతు చేస్తున్నారు. గురువారం నాటికి ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రుక్మేందర్‌రెడ్డి, ఏఈ

ఉపాధ్యాయులకు 'ఉన్నత' శిక్షణ

- రాష్ట్రంలో తొలిసారి వనపర్తిలో అమలు
- జిల్లాలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు 126 మంది

వనపర్తిటౌన్: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 126 మంది ఉపాధ్యాయులు పదోన్నతి పొందారు. వీరంతా 15 నుంచి 28 ఏళ్ల పాటు ప్రాథమిక విద్య బోధనకే పరిమితమైన పదోన్నతి రావడంతో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బయోసైన్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టుల్లో బోధన చేయడంలో ఉండే ఇబ్బందులను తొలగించేందుకు విద్యా శాఖ రాష్ట్రంలోనే మొదటిసారిగా వనపర్తిలో ఈ శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు డీసీఈబీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలనే తలంపు రాష్ట్రంలో తొలిసారి వనపర్తిలోనే చేపట్టింది. ఇందుకోసం ఒక్కొక్క సబ్జెక్టు నుంచి ఇద్దరు అపారమైన సబ్జెక్టు నిష్ణాతులతో అవగాహన కల్పించారు. దీంతో పాటుగా ప్రత్యక్షంగా సైన్స్ సబ్జెక్టులో భాగంగా మేక గుండె, కన్ను పనితీరు వివరాలను ఒక్కొక్క భాగాన్ని కోస్తూ వాటి నిర్మాణం, అందుల్లోని విభాగాల గురించి వివరించారు.

విద్యార్థుల ప్రగతికి బోధనే ప్రామాణికం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయుల బోధనే అత్యంత ప్రామాణికం అని ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఉన్నత పాఠశాలల్లో మెరుగైన బోధన చేసేందుకు ఆయా సబ్జెక్టుల్లో అవగాహన, నైపుణ్యం, సామర్థ్యాలు పెంచుకునేందుకు ఉపాధ్యాయులకు ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు. గణితం, జీవ, సాంఘిక శాస్త్రాలతో పాటు ఆంగ్ల భాషలో వైవిద్యం అయిన పద్ధతులను శిక్షణలో నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్లు ఉమాదేవి, మద్దిలేటి, శంకరయ్య, గాయత్రి, ఆర్పీలు రాఘవేందర్, బాలస్వామి, సాయి చందర్‌రెడ్డి, స్వప్న, శ్రీనివాస్‌గౌడ్, కదిర్, విష్ణు, డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ సందర్భంగా మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు

ఇబ్బందులు తొలుగుతాయి

27 ఏళ్ల తర్వాత ఎస్‌ఏ (బయో సైన్స్) ఉపాధ్యాయురాలిగా పదోన్నతి పొందాం. సబ్జెక్ట్ పరంగా ఇబ్బందికర పరిస్థితులను చవిచూశాం. ట్రైనింగ్ ద్వారా ల్యాబ్ యాక్టివిటీస్ గురించి ఆర్పీలు ప్రత్యక్షంగా చూయించారు. ఇలాంటి ట్రైనింగ్‌ను మరొకసారి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సబ్జెక్ట్‌పై పట్టు పెరిగిందనే నమ్మకం కలిగింది.

– జయజ్యోతి, జెడ్పీహెచ్‌ఎస్, ఏదుల

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.7.82 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు జరిగాయని డీఆర్‌డీఓ ఉమాదేవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదిక కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. గతేడాది జరిగిన పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేయగా.. రూ. 58,994 రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పలువురు ఈజీఎస్ సిబ్బందికి రూ.32 వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కల పెంపకంలో పురోగతి కనిపిస్తుందని, ఈజీఎస్ పనుల్లో జరిగిన పారపాట్లను దిద్దుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్‌పర్సన్ బాలు, అంబుడ్స్‌మెన్ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ రహీం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ శేఖర్‌గౌడ్, పలువురు ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

పౌష్టికాహారం అందించండి

అమరచింత: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల ఎత్తు, బరువు తగ్గుదలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ లక్ష్మమ్మ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈమేరకు విద్యార్థుల బరువు పెరుగుదల రిజిస్టర్ తనిఖీ చేశారు. పెరుగుదల తక్కువగా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రానికి రప్పించి భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

వనపర్తి రూరల్: విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడొద్దని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన పెబ్బేరు మండల కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.